ఓంశ్రీసాయిరాం

ఆంగ్ల భాషా మోహమావరించిన నాడె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లె
స్వమత విజ్ఞానంబు సన్నగిల్లిన నాడె
సంస్కార భావంబు సమసిపోయె
సంస్కార భావంబు సమసిపోయన నాడె
ధర్మంబు క్షీణించె ధరణియందు
ధర్మము క్షీణమై ధరణి తొలగిన నాడె
భారతీయోన్నతి భగ్నమయ్యె
కాన యిపుడైన మీరలు కన్నుదెరచి
తెలివితోగాంచుడో భారతీయులార
ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు
సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!

ఇది పుణ్యభూమి, త్యాగభూమి, పతివ్రతామ తల్లులు జన్మించినటువంటి పవిత్రభూమి.

గతజీవుడగు పతిన్ బ్రతికించుకున్నట్టి
సావిత్రి భారత సతియె కాదె!
తన సత్య మహిమచే దావాగ్ని చల్లార్చె
చంద్రమతి పవిత్ర పడతి కాదె!
కులసతీత్వమునకై గుండాన దూకిన
సీత భారత ధరాజాత కాదె!
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
దమయంతి భారత రమణి కాదె!
సప్త సాగర పరివేష్టితోర్వితలము
భరత జాతి పాతివ్రత్య ప్రవిమలంబు
భావసంపదకిది మహా పంట భూమి
అఖిల దేశములకిది ఉపాధ్యాయి కాదె!

మరణించిన పతిని బ్రతికించుకున్నట్టి సతి యింకేదేశములోనైనా ఉన్నదేమో చూడండి. సీత క్షణమైనా ఆ రావణుని ముఖము చూడలేదు. క్రిందికి వంచుకున్న తల పైకెత్తలేదు. అటువంటి పతివ్రతామ తల్లులు జన్మించిన పుణ్యభూమి ఇది. మగవారియందు అట్టి ఉన్నత భావములు కలిగినటువంటివారు లేకపోయినను, భారతదేశములో ప్రతి ఒక్క స్త్రీయయందు కూడను ఆ పతివ్రతామతల్లుల సత్యమైనటువంటి భావము, నిత్యమైనటువంటి ధర్మము హృదయములో నిండి ఉన్నాయి. పతి వచ్చినప్పటికీ తలుపు ఓరగానుంచి మాట్లాడేటువంటివారేగాని, ఎదురుగా వచ్చి మాట్లాడే వారు కారు, భారతీయ స్త్రీలు. శివుడు యిట్టి పవిత్రమైన భూమియందు పుట్టక ఇంకెక్కడ పుడతాడు!

కేవలం వ్రతములు, పూజలు, యజ్ఞయాగాది క్రతువులు సల్పినంత మాత్రమున భగవంతుడు ప్రత్యక్షం కాడు. హృదయ పవిత్రతచేతనే, సద్గుణములచేతనే భగవంతుని ప్రత్యక్షం గావించుకోవచ్చును. సృష్టియందున్నటువంటి సమస్త వస్తువులు, సమస్త జీవులుకూడను సృష్టి, స్థితి, లయ కారకుడైన భగవంతునినుండి ఉద్భవించినవే. ప్రతి పదార్థమూ భగవంతునియొక్క వరప్రసాదమే. ప్రతి వస్తువులోనూ భగవంతుడున్నాడు. 'ఈశ్వరస్సర్వభూతానాం', 'ఈశావాస్యమిదంసర్వం', కనుక, ఏ పదార్థమును చూసినప్పటికిని అది ఈశ్వరస్వరూపకముగనే భావించాలి. (కర్చీఫ్‌ను చూపుతూ) ఇది వస్త్రము అంటారు.

కాని, ఇది వస్త్రము కాదు, దారముల చేరిక. అయితే, ఇది దారములయొక్క చేరిక కూడా కాదు, ప్రత్తి యొక్క స్వరూపమే. ప్రత్తిచేత దారము, దారములచేత వస్త్రము తయారౌతున్నాయి.

భగవంతునియొక్క తత్త్వమేమిటి? 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మలస్వరూపిణం'. ఎవరికి తోచిన పేరు వారు పెడుతున్నారుగాని, భగవంతునికి ఒక నామము, ఒక రూపము లేవు. 'సర్వతః పాణిపాదం'. ఎక్కడ చూసినా ఉన్నటువంటిది భగవంతుడే! కేవలం మానవ శరీరాన్ని మీరు చూస్తున్నారు. ఇది నీటి బుడగ వంటిది. మైండు కోరికల మూట. ఇట్టి మనస్సును, అట్టి దేహమును నమ్ముకొని మనము జీవించరాదు. దేహము భగవంతుడిచ్చిన వరప్రసాదమే. భగవంతుడు ఇచ్చిన సర్వమూ భగవంతునికే అర్పితము గావించే నిమిత్తమై మనము జన్మించాము. కృష్ణుడు, 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. 'మీరందరూ నా అంశములే' అన్నాడు. నీవు కేవలం మానవుడవు కావు. నీ పేరు నీకు తల్లిదండ్రులు పెట్టినది. పుట్టినప్పుడు ఎట్టి పేరూ లేదు నీకు. మానవత్వము దివ్యత్వముతో కూడినదేగాని, అపవిత్రమైనది కాదు. మానవత్వమునందు ఇట్టి పవిత్రమైన తత్త్వము పోషించి మానవులను కాపాడే నిమిత్తమై దైవము అవతరిస్తుంటాడు. ఎప్పుడి ధర్మము క్షీణించునో అప్పుడు దైవము ఉద్భవిస్తుంటాడు.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం.

కనుక, భగవంతుడు అవతరించటం ధర్మోద్ధరణ నిమిత్తమే. ఈనాడు జగత్తులో ధర్మము క్షీణించింది. సత్యము కనుమరుగైంది. అన్యాయ, అక్రమ, అనాచారములతో జగత్తు నిండి ఉన్నది. భగవద్విశ్వాసము ఒక్కటి మాత్రమే సత్యమైనది. truth is God. Love is God. Live in love. ప్రేమలో జీవించాలి. ప్రేమయే లేకుండిన ప్రాణమే లేదు. కనుక, ప్రేమకోసమే మనము భగవంతుని ప్రేమించాలి. ప్రేమచేతనే భగవంతుని పొందాలి.

పండితులవారు చెప్పినట్లుగా అతిరుద్రమునందు అనేక నమక, చమకములు చేరి ఉన్నాయి, మానవత్వాన్ని జీవింపచేస్తున్నాయి. ఇట్టి మహత్తరమైనటువంటి శక్తులు ఎక్కడి నుండి వచ్చాయి? కృష్ణ యజుర్వేదమునందు ఉన్నటువంటి నమక, చమకాలను తీసుకొని, వీనిని పూర్తిగా ఏకీభవింపజేసి, తద్వారా అభిషేక మంత్రములను ఏర్పరచారు. కృష్ణ యజుర్వేదమునందు ఉన్నటువంటి ఇట్టి మంత్రములు మరి దేనియందూ కానరావు. స్మృతి, శాస్త్ర, ఇతిహాస, పురాణములన్నియు ఆ వేదసారమే. కాని, ఈనాడు వేదములన్నియు మరుగున పడిపోయినవి. కారణం ఏమిటి? వీటిని ఉచ్చరించే వ్యక్తులు లేకపోవటమే! నిజానికి వేదము సకలైశ్వర్య సంపన్నమైనది. దానికి మించినది మరొకటి లేదు. మానవునియొక్క స్థితిగతులన్ని కూడను వేదమునందే యిమిడియున్నవి. సర్వులు ఉచ్చరించే నిమిత్తమై భగవంతుడు వేదములను అనుగ్రహించాడు. దీనికి జాతిమత భేదములు ఏమాత్రమూ లేవు.

(స్వామి ఇరువురు విదేశీ విద్యార్థులను వేదికపైకి పిలచి వారిచేత శ్రీసూక్తము చెప్పించారు)

ఈవిధముగా, ప్రతి దేశమనందు, ప్రతి మానవునికి వేదము తెలిపించాలన్నది స్వామి ఉద్దేశ్యము. ఇది కేవలం బ్రాహ్మణులకుగాని, భారతదేశానికిగాని పరిమితం కాదు. మొన్నటి దినము పుట్టపర్తికి ఇరాన్, ఇరాక్ వారు వచ్చారు. ఇప్పుడుకూడా ఇరాన్‌వారు ఉన్నారిక్కడ. అందరికి వేదాన్ని బోధిస్తున్నాము. వేదము సర్వ భేదములను నివారణ గావిస్తుంది. ఈ మహాయజ్ఞము పుత్రకామేష్టి యాగము, అశ్వమేధ యాగమువంటిది కాదు. ఇది ప్రతి మానవునియొక్క ఉద్ధరణకోసమని, మానవ కళ్యాణముకోసమని నిర్వహిస్తున్నాము. వేదము అందరికోసం ఉద్భవించినది. అదృష్టవంతులైనవారు దీనిని నేర్చుకొని ప్రచారము చేస్తున్నారు. దురదృష్టవంతులు వేదము తెలిసికూడను ఎవ్వరికీ బోధించడం లేదు. ఇప్పుడు మా సంస్థల్లో ప్రతి పిల్లవానికి వేదము నేర్పిస్తున్నాము. ఇందుకోసం మొట్టమొదట సంస్కృతము తెలుసుకోవాలి. మన వినయ్‌ని కర్ణాటక యూత్‌లీడరుగా నియమించాము. అదేవిధముగనే, ఆంధ్ర, కేరళ మొదలైన అన్ని రాష్ట్రాలలో, అన్ని దేశాలలో మేము నియమించాము. వీరు యువజనులందరికీ ఈ సత్యాన్ని నిరూపించాలి.

(స్వామి ఈ విదేశీ విద్యార్థులచేత 'నమకం' చెప్పించారు)

ఈవిధముగా అన్ని దేశములవారు కూడను వేదము నేర్చుకుంటున్నారిప్పుడు. యజుర్వేద, సామవేద, అధర్వణ వేదములను, ప్రధానముగా ఋగ్వేదమును నేర్చుకుంటున్నారు. వేదములను మనము అలక్ష్యం చేయకూడదు. వేదములో సృష్టియొక్క రహస్యమంతా ఉంటున్నది. జీవిత లక్ష్యమును వేదము నిరూపిస్తున్నది. ఒక్కటి కాదు, సర్వమూ వేదమునందు ఉంటున్నది. బ్రహ్మచర్య, గృహస్త, వానప్రస్థ, సన్యాస అశ్రమములు నాల్గింటియొక్క సత్యమును ఈ వేదమునందు నిరూపింపబడినది. ఇప్పుడు అందరూ కూడను అర్థం చేసుకుంటున్నారు. ఏ గ్రామము పోయినప్పటికీ ఆ గ్రామములోనున్న స్త్రీలు కూడను వేదములు చెబుతున్నారు. కేవలం దేహపరంగా ఆడ, మగ, అనే వ్యత్యాసము ఉండవచ్చుగాని, వేదమును అభ్యసించటంలో ఎట్టి భేదములూ లేవు. వేదము చాలా విచిత్రమైనది, పవిత్రమైనది. అందులో అతిరుద్రం చాలా గొప్పది. దీనిలో ఉన్నటువంటివి మరిదేనియందూ లేవు. రుద్రమనగా ఈశ్వరుని యొక్క పేరు అనుకుంటారు. కాదు, కాదు. ఇది ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణవేదము. ఈ అన్ని వేదములయొక్క సారమే! అంతేకాకుండా, నమకము, చమకము ఈ రెండిటియొక్క ఏకత్వమే దీనికి గొప్ప పటుత్వము. నమకము 'వద్దు' అంటుంది. చమకము 'కావాలి' అంటుంది. కాని, అన్నింటియందున్న సారము ఒక్కటే. దేనిని వద్దంటుంది. మంచిని కావాలంటుంది. కనుక, రెండుకూడను మనము నేర్చుకోవాలి. చమకము కోరికలతో నిండినటువంటిది. నమకము విరక్తితో నిండినటువంటిది. ఎవరు సన్యాసి, ఎవరు సన్యాసి కాదు అని విచారణ చేస్తే, కామినీ శక్తి కోసం ప్రయత్నం చేసేవాడు సన్యాసి కాదు. కామినీ శక్తియొక్క ఫలమును కోరనటువంటివాడే నిజమైన త్యాగి. ఇల్లూవాకిళ్లను, భూమిని, ధనమును త్యాగము చేస్తే, అదే నిజమైన త్యాగమని అనుకుంటున్నారు. అది త్యాగమే కాదు. అది సులభంగా చేయవచ్చు. కామినీ ఫలమును విసర్జించాలి. ప్రతిఫలమును విసర్జించాలి. అదే నిజమైన త్యాగము.

మనము దేనికోసము పుట్టామనేది తెలుసుకోవాలి. మనము పుట్టింది తినటం, తిరగటం, సుఖాల ననుభవించటం ... ఇందుకోసం కాదు. మన తోటి మానవులకు సహాయం చేసే నిమిత్తము పుట్టాము. Help ever, hurt never. ఎవ్వరినీ బాధించకూడదు. ఎట్టి కఠినమైనటువంటి వాక్కులూ చెప్పకూడదు. ఎవ్వరినీ మనము దూషించకూడదు. పరదూషణ మహాపాపము. ఎటువంటి ద్వేషినైనను దూషించకూడదు. ఇలాంటి మంచి గుణములు మనలోనే దాగియున్నవి. దేహము పాంచభౌతికము, పంచేంద్రియములతో కూడినది. ఈ ఇంద్రియాలన్నీ కోరికలతో కూడినటువంటివి. కాని, మనకు తెలియకుండా లోపల దాగినవి కొన్ని ఉన్నాయి. అవే సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస. వీనిని మనలోపలినుండి ఆవిర్భవింపచేసుకోవాలి. దీనినే 'ఎడ్యుకేర్' అన్నారు.

ఈనాడు పుస్తకాలు చదివి నేర్చుకొనే విద్యను 'ఎడ్యుకేషన్' అని అంటారు. ఈ 'ఎడ్యుకేషన్' కాదు మనము నేర్చుకోవలసినది. ఎవరో పుస్తకాల్లో వ్రాసినటువంటి విషయాలను చదువుకొని నేర్చుకోటం కేవలం 'ఎడ్యుకేషన్' మాత్రమే. ఎవ్వరూ చెప్పే అవసరం లేకుండా తనలో ఉన్న సద్గుణాలను ఉద్భవింపచేసుకొని పవిత్రమైన మార్గంలో ప్రవేశించటమే 'ఎడ్యుకేర్'. అదే భగవంతుని ప్రసాదము. అది భగవంతునియొక్క అనుగ్రహము చేతనే లభ్యమౌతుందిగాని, లేకుండిన లభ్యం కాదు. మనము నిరంతరమూ 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం' చేస్తూ ఉండాలి. అదే నిజమైన భక్తి. మనము ఈశ్వరుడన్నా, విష్ణువన్నా ఏ పేరు పెట్టి పిలిచినా పలికే దివ్యత్వం ఒక్కటే.

'శృంగారములు వేరు, బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు, పాలు ఒకటే'

అట్లనే, భగవంతుడు ఒక్కడే. 'అల్లా' అను, 'ఏసు' అను, 'రామా' అను, 'కృష్ణా' అను. ఏ పేరైనా పెట్టుకో. భగవంతుడు ఒక్కడే. ఇవన్నీ ఒకే భగవంతునియొక్క వేర్వేరు పేర్లు మాత్రమే. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'. కనుక, మనము భగవంతుని విషయంలో భేదము పెట్టుకోకుండా ఉండాలి. భగవంతునియొక్క రహస్యాన్ని తెలుసుకోవాలంటే 'ఓపెన్ హార్ట్' కావాలి. నీకు ఏ పేరు ఇష్టమో అది నీవు తలుచుకో. తప్పులేదు. అంతేగాని, ఒక రూపనామాలను దూషించటం, మరొక రూపనామాలను

పూజించటం చాలా తప్పు. కొందరు 'నారాయణా' అంటే ఇష్టపడతారు. 'శివా' అంటే వారికి ఇష్టముండదు. ఇది చాలా తప్పు. ఈశ్వరుడు, నారాయణుడు ఇరువురూ చేరి ఒక్కటే. ఒకే దైవత్వాన్ని మనము అనేక పేర్లతో పూజిస్తున్నాము. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించి పూజించినవారికి తప్పక మానసిక శాంతి కలుగుతుంది. ఒక రూపాన్ని ద్వేషించి, మరొక రూపాన్ని ప్రేమిస్తే మన అభీష్టము నెరవేరదు. ఇది మంచిది కాదు. ఈ సత్యాన్ని కేవలం యూత్ మాత్రమే కాదు, అందరు కూడను గుర్తించి అనుసరించవలసినదే. దైవత్వమే ఈనాడు లోకాన్ని రక్షిస్తున్నది. భగవన్నామము 'ఆటంబాంబు' కన్న అత్యంత శక్తివంతమైనది. చెడ్డను శిక్షిస్తుంది. మంచిని పోషిస్తుంది. కనుక, దైవత్వాన్ని మనము పూజిస్తూ ఉంటే తప్పక లోకరక్షణ జరుగుతుంది. లోకకల్యాణము కోసమని చేస్తున్నాము. ఈ మంత్రములోపల చాలా ప్రధానమైన అంశముంటున్నది. అతిరుద్ర మహాయజ్ఞము పవిత్రమైన తత్త్వాన్ని పోషించి, దుష్టత్వాన్ని శిక్షించి లోకకల్యాణం గావిస్తుంది. దీనిని ఎవ్వరైనా చేయవచ్చును.

ఈ యజ్ఞము నిమిత్తము ఇంత బియ్యమిస్తాము, లేక ఏదైనా పదార్థమిస్తాము, లేక ఫలములిస్తాము, లేక కూరగాయలిస్తాము అని ఎంతోమంది ముందుకు వచ్చారు. కాని, మన వినయ్‌కుమార్ ఎవ్వరివద్దనుండి యేమీ తీసుకోలేదు. ఈ యజ్ఞము ఎంతో ఖర్చుతో కూడినది. అయినప్పటికీ అతను ఎవ్వరి దగ్గరనుండి ఏమీ పుచ్చుకోకుండా, తానొక్కడే స్వయంగా అన్ని చోట్లకు తిరుగుతూ, అన్నీ సేకరించాడు. కనుక, అలాంటి సేవాదళ్ లీడర్సు ప్రతి రాష్ట్రంలోనూ తయారుకావాలి. వినయ్‌కుమార్ చాలా గొప్ప సేవ చేస్తున్నాడు. నేనే ఎంతో మెచ్చుకున్నాను. ఎవరైనా ఏమైనా ఇస్తామని ముందుకు వచ్చినా కూడా, 'వద్దు, వద్దు. నాకు సాయి ఉన్నాడు. సాయే నాకు సహాయం' అంటూ వచ్చాడు. అతనికి వివాహమై పది సంవత్సరములైంది. భార్యాభర్తలిద్దరుకూడను ఆధ్యాత్మిక మార్గములో ఉన్నారు. 'ఏమమ్మా! ఇప్పుడు యజ్ఞము చేస్తున్నారు. కుమారుడు కావాలా?' అని అడిగితే, 'మాకు వద్దు సావమీ', అన్నారు. 'మరి ఏమి కావాలి?' అని అడిగితే, 'మీరే కావాలి' అన్నారు. ఈవిధమైన పలుకులు ఏ దంపతులవద్దనుండి నేను వినలేదు. చాలా ప్రేమతో, సహృదయంతో చాలా మంచి కార్యాలు చేస్తున్నాడు, వినయ్‌కుమార్. అతని తండ్రి ఇన్‌కమ్‌టాక్స్ కమీషనరు. అతడు లక్ష్మీనారాయణతో కలసి పనిచేశాడు. ఇప్పుడు కూడ మన వినయ్ లక్ష్మీనారాయణతోనే చేరి ఉన్నాడు. తన తండ్రి మాదిరి చూసుకుంటున్నాడు. ఇలాంటి వ్యక్తులు, ఇలాంటి యువకులు జగద్వ్యాప్తి కావాలి. లీడర్లు మంచిగా ఉన్నప్పుడే ప్రపంచమంతా సరిగా ఉంటుంది. లీడర్లు మంచిగా లేకపోవటం చేతనే ఈనాడు ప్రపంచానికి ఈ గతి పట్టింది.

అన్నింటియందుకూడను విద్యారంగము నందుగాని, రాజకీయరంగమునందుగాని, ధార్మిక, ఆధ్యాత్మిక రంగములందుగాని మంచి లీడర్లు కావాలి. కాని, ఈనాడు మంచి లీడర్లు చాలా అరుదుగా కనిపిస్తున్నారు. ఎక్కడ పోయినా డబ్బు, డబ్బు, డబ్బు! అంతా వ్యాపారమే! కాని, మా సంస్థలో అలాంటి అవస్థలు లేవు. అన్నీ ఫ్రీ! ఎద్యుకేషన్ ఫస్టు క్లాసునుండి పి.హెచ్‌డి. వరకు అంతా ఉచితమే! మా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులుగాని, జనరల్ ఆసుపత్రులుగాని ఫ్రీగా సేవలు అందిస్తున్నాయి. బయట ఒక హార్టు ఆపరేషను చేయాలంటే మూడు, నాలుగు లక్షలు కావాలంటారు. పేదవారు అంత డబ్బు ఎక్కడినుండి తీసుకురాగలరు! వారికి చేతకాదు. వారికి ఫ్రీగా సేవ చేస్తున్నాము. కట్టుబట్టలతో వచ్చి చేరి, క్రొత్తబట్టలతో తిరిగి వెడుతున్నారు. అందరికీ మనము ఫ్రీగా సర్వీసు చేయాలి. మన సేవాదళము వారంతా, మన కాలేజీ పిల్లలు కూడను సమాజానికి ఫ్రీ సర్వీసు చేయాలి. దాంట్లోనే స్వామియొక్క అనుగ్రహము మీకు లభిస్తుంది. మీరు దేనిని మరచినప్పటికీ భగవన్నామాన్ని మాత్రము మరువకూడదు.

ప్రేమస్వరూపులారా! అతిరుద్రమహాయజ్ఞమనేది ఉత్తమమైనది, పవిత్రమైనది, అత్యంత శ్రేష్ఠమైనది. కనుక, దీనిని చేసినవారు చాలా ధన్యులౌతారు. మొత్తం పదకొండు హోమగుండములుంటున్నాయి. ఒక్కొక్క హోమగుండము వద్ద పదకొండుమంది చొప్పున ఋత్విక్కులు టెరుతుంటారు. కనుకనే, హోమగుండముల వద్ద మొత్తం 121 మంది ఋత్విక్కులున్నారు. యజ్ఞానికి సంబంధించిన అన్ని విషయాలను చూసుకోటానికి ఒక్కొక్క యజమాని ఉంటాడు. అందరూ కలసి ఐకమత్యంగా చేస్తారు. ఐకమత్యము చేతనే మనము ఎంతైనా సాధించ వచ్చును. యూనిటీనుండి మనకు ప్యూరిటీ వసస్తుంది. ప్యూరిటీనుండే డివినిటీ ఆవిర్భవిస్తుంది. కనుక, మనము పరస్పరం అన్నదమ్ములవలె, అక్కచెళ్ళెవలె

మెలగాలి. ఒకవేళ ఎప్పుడైనా కోపం వస్తే, 'ఇది నా శత్రువు' అని గ్రహించి దానిని తక్షణమే దూరము చేసుకోవాలి. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు ఈ ఆరుకూడను మానవిని హినిసించే శత్రువులు.

దివ్యాత్మస్వరూపులారా! మీరందరూ ఆత్మస్వరూపులేగాని సామాన్య మానవులు కారు. కేవలం గుర్తుకోసం ఒక్కొక్క రూపానికి ఒక్కొక్క పేరు మీరు పెట్టుకున్నారేగాని, అందరూ ఆత్మస్వరూపులేగాని సామాన్య వ్యక్తులు కారు. అందరూ క్షేమంగా, ఆనందంగా, సుఖంగా, సంతోషంగా జీవింతురు గాక! నిజముగా భక్తియే లేకపోతే మీకు శాంతి లభించదు. కాబట్టి మీరు భక్తిని అభివృద్ధిపరచుకోవాలి బంగారు! మీరు 'డివోషన్'లో ఉండాలిగాని, 'డీప్ఓషన్'లో కాదు. ఈ 'డివోషనే' మిమ్మల్ని 'డివైన్' చెంతకు చేరుస్తుంది.

(అతిరుద్రమహాయజ్ఞము ప్రారంభ దినమున సాయికుల్వంత్‌లో 09.08.2006 సాయంత్రము యిచ్చిన దివ్యోపన్యాసము)